క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పర్తియాత్ర



హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి చేరుకున్న జార్ఖండ్ సత్యసాయి భక్తులు ఆదివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సామూహిక హనుమాన్ చాలీసా, గాయత్రి మంత్రాన్ని పఠించారు. మూడు రోజుల పర్తియాత్రలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తలుపుల: మండల కేంద్రంలోని సచివాలయం -1 పరిధిలోని బలిజపేటలో సోమవారం ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రఫీనాయక్, సర్పంచ్ శ్రీలత, జోనల్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి (డీకేబాబు) తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన బషీర్

ఓడీచెరువు: మండలంలోని నున్నంపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో కొక్కంటివారిపల్లికి చెందిన బషీర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. బషీర్ వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంలో కదిరికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మార్గమధ్యంలో నున్నంపల్లి క్రాస్ వద్ద కుక్క అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన రక్తగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు 108లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లినట్లు సమీప బంధువులు తెలిపారు.

శివపార్వతులకు పూజలు

ముదిగుబ్బ: స్థానిక శివ పంచాయతన దేవాలయంలో ఆదివారం అఖిల గాండ్ల సంఘం ఆధ్వర్యంలో శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం నిర్మించి ఏడు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎనిమిదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు మనోహర శాస్త్రి, రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

ఓడీచెరువు: స్థానిక అంబేడ్కర్ కూడలిలో కొత్తపల్లి బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ గోపి ఆదివారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. తాగునీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టైలర్ నిజాం, జయన్న పాల్గొన్నారు.


సుడిదోమపై అవగాహన అవసరం



రైతులకు సూచనలిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: వరి, మొక్కజొన్న తదితర పంటలను నాశనం చేసే సుడిదోమపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని జగరాజుపల్లిలో సుడిదోమపై అవగాహన కల్పించారు. సుడిదోమ నివారణకు ఎకరాకు బూప్రోఫెజిన్25ఎస్‌సీ 400 మిల్లీ, 120 గ్రాముల పైమెట్రోజైన్ 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. అసిఫేట్ 75 డబ్ల్యూపీ 350 గ్రాముల మందును 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంటలను నాశనం చేసే పురుగులో ఇది చాలా ప్రమాదకరమైందని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు భానుతేజ రెడ్డి, చైతన్య రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు 'ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్'



ముదిగుబ్బ: పాదుపు సొమ్మును విశాలా ఫెర్రర్‌కు అందజేస్తున్న మహిళలు

కదిరి అర్బన్/బత్తలపల్లి/ముదిగుబ్బ/ధర్మవరం రూరల్/తాడిమర్రి/రామగిరి/కనగానపల్లి: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఆదివారం ఫెర్రర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలా ఫెర్రర్, హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. పొదుపు మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. బత్తలపల్లి మండలంలో 3,100 హుండీలను ప్రజలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. గత ఏడాది రూ.13.20 లక్షలు హుండీల ద్వారా వచ్చినట్లు విశాలా ఫెర్రర్ తెలిపారు.

జగన్ మాకు మంచి చేశారు

- 'జగనన్నే మా భవిష్యత్తు'కు ప్రజల నుంచి స్పందన



ప్రశాంతి నిలయం: పుట్టపర్తిలో మహిళ నుంచి అభిప్రాయం సేకరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ప్రశాంతి నిలయం: నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం పుట్టపర్తి నగర పంచాయతీ పరిధిలోని 6వ సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే వార్డుల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారితో మమేకమై నాలుగేళ్ల జగన్‌మోహన్ రెడ్డి పాలనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలను మోసం చేసిన తీరును వివరించారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనపై సంతృప్తిగా ఉన్నట్లయితే 8296082960 నంబర్‌కు మిస్ట్ కాల్ ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ సారథిగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ప్రతి పక్ష పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. 2024లో తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, నెడ్ క్యాప్ డైరెక్టర్ మాదవ రెడ్డి, వైస్ చైర్మెన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్ సాయిగీత, నాయకులు రఘు, కడప రాజా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని 7 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం కొనసాగించారు. కార్యక్రమంలో కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీంద్రానాయక్ పాల్గొన్నారు.

తాడిమర్రి: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి వలంటీర్లు, గృహ సారథులకు సూచించారు. ఆదివారం సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డితో కలసి జగనన్నే మా భవిష్యత్తు కిట్లను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికీ జగనన్నే మా భవిష్యత్తు, జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అతికించాలన్నారు. కార్యక్రమంలో మారక శివారెడ్డి, విశ్వనాథ్, చిన్నగంగిరెడ్డి పాల్గొన్నారు.

నల్లమాడ: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని మండలంలో విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరిస్తున్నారు. గత నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. టీడీపీ హయాంలో జరిగిన మోసాన్ని, అబద్ధపు హామీలను వివరించారు. ప్రజల అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు.

ఎన్పీకుంట: మండలంలోని పది సచివాలయాల పరిధిలో ఆయా సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అలాగే లబ్ధిదారులతో మాట్లాడి స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీలు కొత్త రంగారెడ్డి, తిమ్మారెడ్డి, సరస్వతి, సర్పంచులు నాగమునీశ్వరనాయుడు, భారతమ్మ, నాయకులు తిరుమల నాయుడు, వెంకటరామిరెడ్డి, సోమిరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

బత్తలపల్లి: పేద ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని గరిశలపల్లి, దంపెట్ల పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం సర్పంచ్ చల్లా కరుణాకర్‌నాయుడు, పద్మావతితో కలిసి నిర్వహించారు. గుమ్మల్లకుంటలో సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, వెంకట్, బండి వీరనారప్ప, నాగిరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్లపల్లి, గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా నిర్వహించారు గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు వై.శ్రీధర్ రెడ్డి, పోలం సూర్యశేఖర్‌రెడ్డి, సిద్దారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకట రమణారెడ్డి, ఫక్రుల్లాఖాన్, హరినాథ్, ఎం.నాగార్జున, నాగరాజు, జయచంద్రారెడ్డి, ఆరీఫ్‌ఖాన్, గృహసారథులు, రత్నమ్మ అమర్‌నాథ్‌రెడ్డి, లక్ష్మీదేవి, ఆంజనేయులు, వలంటీర్లు గంగరాజు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



తాడిమర్రి: జగనన్నే మా భవిష్యత్తు కిట్లను పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి



గాండ్లపెంట: నీరుకుంట్లపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయికులు

ముదిగుబ్బ: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ముదిగుబ్బలోని 4, 5 వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతు ప్రభుత్వం పాలనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదే విధంగా స్టిక్కర్లను ఇంటి గోడలకు అంటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఇందుకూరి నారాయణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ భాస్కర్, చంద్రాయుడు, కిరణ్‌మోహన్‌రెడ్డి, కుల్లాయప్ప పాల్గొన్నారు.

కొత్తచెరువు: బుక్కపట్నం రహదారిలోని విజయనగర్ కాలనీ, బోయవీధి, బసవన్నకట్ట వీధి, బీసీ కాలనీ, దళిత కాలనీల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వం, మన ప్రభుత్వం మధ్య తేడాలను అడిగి తెలుసుకున్నారు. వారు సంతృప్తి వ్యక్తం చేసిన అనంతరం ఇంటికి స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, మటన్ శంకర్, నాగరాజు, అంగడి సోమశేఖర్ రెడ్డి, షాన్‌షేట్, ఎంపీటీసీ రఫీ, పెయింటర్ కేశవ, గిరి, ఎల్లప్ప, బాబు, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

ముదిగుబ్బ: ముదిగుబ్బలోని వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలో సోమవారం 3వ విడత ఆసరా చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఏరియా కో-ఆర్డినేటర్ రమణప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

అబూబకర్ మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కదిరి అర్బన్: పట్టణంలోని నిజాంవలీ కాలనీలో ఉన్న అబూబకర్ మసీదులో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ఆ పార్టీ కదిరి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్,సీనియర్ నాయకులు డా.బత్తల వెంకటరమణ, యువ నాయకులు అనిల్ కుమార్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బాహుద్దీన్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ నూరుల్లా పాల్గొన్నారు.

భర్త ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గిర్రాజు కాలనీలో కూలి పనులు చేస్తు జీవిస్తున్న రాము తన భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిందని మనస్థాపంతో ఆదివారం చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాము తన భార్య శిరీషతో వారం రోజుల క్రితం గొడవపడటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కాపురానికి రావాలని పిలుస్తున్నా ఆమె రాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఆదివారం ఎడమ చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీనే పరిటాల కుటుంబ నైజం





చెక్కు అందిస్తున్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సమావేశంలో పాల్గొన్న మహిళలు

- పేరూరు డ్యాంతోపాటు చెరువులకు హంద్రీనీవా నీరు
- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి/కనగానపల్లి: గతంలో 25 ఏళ్లపాటు పెనుకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేగా పనిచేసిన పరిటాల కుటుంబం దోపిడీనే ధ్యేయమైతే.. మేము నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని పేరూరులో రామగిరి, కనగానపల్లి మండలాలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా కార్యక్రమ చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేతోపాటు ఎంపీ గోరంట్లమాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో హామీలు గుప్పించి, ప్రజలను మోసం చేశారన్నారు. పరిటాల సునీత మంత్రి హోదాలో అసెంబ్లీలో మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేయడంలేదని, ఆ ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదని అన్నారన్నారు. రైతుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు..మోసం చేశారన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు..

టీడీపీ హయాంలో నియోజకవర్గానికి తాగునీటి పథకం తీసుకొద్దామనే ఆలోచన కూడా చేయలేదని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం జలజీవన్ మిషన్ ద్వారా రూ.110 కోట్లతో ఆరు మండలాల్లోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీటిని తీసుకురావడంతోపాటు నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపామన్నారు. త్వరలో రామగిరి బంగారు గనులను తెరిపించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం అక్కాచెల్లెమ్మలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు డెయిరీని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మహిళల పక్షపాతి వైఎస్ జగన్..

అనంతరం ఎంపీ గోరంట్ల మాదవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు మాట్లాడారు. మహిళల పక్షపాతి సీఎం జగన్ అని, రాష్ట్రంలో మహిళలకు సగ భాగం పదవుల్లో స్థానం కల్పించారన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అన్నారు. రాష్ట్రంలో ఎంతో మందికి రాజకీయ పదవులు కల్పించి, ఉన్నత స్థానంలో నిలిపారన్నారు. అనంతరం కొల్లాపురమ్మ ఆలయంలో పూజలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మెగా చెక్కు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు కద్రెన్న, కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీలు గోసే నాగార్జున, గొని మారుతీప్రసాద్, కన్వీనర్లు రమేష్, అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ సరస్వతి పాల్గొన్నారు.

రైతన్నల శ్రేయస్సే లక్ష్యం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: గ్రామీణ ప్రజలను దృష్టిలో ఉంచుకుని, వారి శ్రేయస్సు లక్ష్యంగా సచివాలయం, రైతు భరోసా, హెల్త్ సెంటర్లను సీఎం జగనన్న ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉడమలకుర్తిలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, హెల్త్ సెంటర్లను ప్రారంభించారు. అనంతరం ఆర్బీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో అన్ని రకాల సేవలతో పాటు, రైతులకు సలహాలతో పాటు ఎరువులు, మందులు, ఆరోగ్య పరంగా మీ వద్దకే వైద్యం అందేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విత్తన కాయల కోసం మండల కేంద్రంలో రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. నేడు మన చెంతకే విత్తన కాయలు, మందులు అందేందుకు రైతు భరోసా కేంద్రాలు చాలా ఉపయోగం అన్నారు. జిల్లా అగ్రిఅడ్వైజర్ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోనే రైతు భరోసాలు అందుబాటులోకి తెచ్చిన ఘనత ఎమ్మెల్యే, కదిరి ప్రాంతానికే దక్కుతుందన్నారు. అనంతరం సీఎస్‌పి ఆధ్వర్యంలో ఏర్పాట చేసిన స్టాల్‌ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, వెంకటపతినాయుడు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ రఫీనాయక్, ఎంపీడీఓ రామానాయక్, వైద్యాధికారి మున్వర్‌బాషా, సర్పంచ్ అనూష, అగ్రి అడ్వైజర్ బోర్డు మండల చైర్మన్ చెన్న కృష్ణారెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి క్రిష్టారెడ్డి (డీకే బాబు), మాజీ సర్పంచులు పయాజ్ అహమ్మద్, మండల జేఏసీ కన్వీనర్ టోపీ రమణ, బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ధర్మవరం అర్బన్: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బత్తలపల్లి/ధర్మవరం అర్బన్/పుట్టపర్తి టౌన్/ఓడీచెరువు: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఆదివారం ఈస్టర్‌ను ఘనంగా జరుపుకున్నారు. అంతకుముందు చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రీస్తు జీవిత విశేషాలపై గేయాలను ఆలపించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఈస్టర్ విశిష్టతను వివరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: పుట్టపర్తి సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఓబుళంపల్లలో ఉచిత వైద్య విభిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న వైద్యశిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు చేసి, మందులు ఇస్తామన్నారు.

జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులుగా షాకీర్, రఫీ


ధర్మవరం: శ్రీ సత్యసాయి జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులుగా ధర్మవరానికి చెందిన మహమ్మద్ షాకీర్, రఫీను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. శనివారం విజయవాడలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా ఉత్తర్వులు అందజేశారు. ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి నూతన సభ్యులు షాకీర్, రఫి కృతజ్ఞతలు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కనగానపల్లి: దాదులూరు వద్ద ఆదివారం జాతీయ రహదారిపై వెళ్తున్న ఐచర్ వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తర్వాత అది రహదారి పక్కనే గ్రామంలోని ఇళ్ల వైపు దూసుకెళ్లింది. ఈ సమయంలో ఇళ్ల ముందు జనం లేకపోవటంతో ప్రాణాపాయం తప్పింది. వాహనంలో ప్రయాణిస్తున్న వారికి కూడా ఎలాంటి గాయాలు కాలేదు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నాట్యం చేస్తున్న మహిళలు

పుట్టపర్తి టౌన్: ఎనుములపల్లి సమీపంలో ఉన్న శిల్పారామంలో ఆదివారం సాయంత్రం అంధుల నిరీక్షణ సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అంధుల నిరీక్షణ సంఘం స్థాపన దినోత్సవం సందర్భంగా అంధ కళాకారులతో నిర్వహించిన సాంస్కృతిక నాట్య కళా ప్రదర్శన, సంగీత విభావరి ఆకట్టుకున్నాయి. అనంతరం విరాళాలు అందజేసిన దాతలను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, నాయకులు ఎస్డీడీ నరసింహులు, నరసింహులు, సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

కనగానపల్లి: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన క్షతగాత్రులను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పరామర్శించారు. ఆదివారం పర్వతదేవరపల్లి సమీపంలో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనింది. అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు, ఒక బాలుడు గాయపడి రోడ్డుపక్కన ఉండగా, ఇదే సమయంలో అనంతపురం నుంచి పేరూరు వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ గమనించి తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులను పరామర్శించారు. స్థానికులతో కలిసి ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నల్లమాడ: నల్లమాడకు చెందిన పొరకల వెంకటరమణ భార్య పద్మావతమ్మ (62) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఉదయం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి భర్త, కుమారులు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పొరకల రమణ, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మెన్ ఆవుటాల రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, నాయకులు తిరుపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, దాదిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, ప్రతాప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తలారి కొండప్ప (70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు ,సర్పంచ్ పంచరత్నమ్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కొండపప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, ఉత్తన్న, నజీర్, గట్టు హరి, వెలుగు సీసీ అంజి, ఎల్లప్ప,శంకర్, చిన్నరెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్లతో పేదలకు కంటిచూపు



మాట్లాడుతున్న రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి ఆపరేషన్లతో నిరుపేదలకు కంటిచూపు అందిస్తున్నామని రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి తెలిపారు. పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటిచూపు తగ్గిన వారికి కంటి వైద్య పరీక్షలు చేశారు. 207 మంది కంటి పరీక్షలు చేయించుకోగా.. 122 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి ఆపరేషన్లను కూడా బెంగళూరుకు తీసుకెళ్లి చేయించనున్నామని రోటరీక్లబ్ సభ్యులు తెలిపారు. అనంతరం వైద్య శిబిరం దాతలను శాలువాలతో రోటరీక్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు రమేష్‌బాబు, సోలిగాళ్ల వెంకటేశులు, సత్రశాల ప్రసన్నకుమార్, సుదర్శన్‌గుప్త, శ్రీనివాసరెడ్డి, శివయ్య, జయచంద్ర, మనోహర్‌గుప్తా పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

ధర్మవరం: బీజేపీని పోలింగ్ బూత్ స్థాయిలో విస్తరించాలని, ఆవిధంగా పార్టీ బలోపేతానికి ప్రత ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ పోలింగ్ బూత్ స్వశక్తి కరణ అభియాన్ కార్యక్రమం అసెంబ్లీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో బూత్ కమిటీలను పూర్తి చేసి సరళ యాప్‌లో అప్లోడ్ చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, ఉపాధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిలకర ఆంజనేయులు, శంకర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.